



పట్టణాలకు వెళ్లేందుకు ఓడీసీలో బస్సు కోసం వేచి చూస్తున్న గ్రామీణ ప్రజలు

భూములన్నీ బీళ్లే..



నాకు ఐదు ఎకరాల మెట్ట భూమి ఉంది. ఖరీఫ్‌లో వర్షాలు లేక బీళ్లుగా వది లేశాం. అప్పు, సప్పులు చేసి వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసుకున్నాం. వరుణుడు కరుణించక పోవడంతో, విత్తనాలు ఊజీ పట్టాయి. దీంతో వాటిని అయినకాడికి అమ్ముకో వడానికి ప్రయత్నిస్తున్నా. స్థానికంగా ఉపాధి పనులు కల్పిస్తే కుటుంబ పోషణకు ఆసరగా ఉంటుంది. లేదంటే వలస వెళ్లక తప్పదు.

-ఇడుగొట్టు రమణమ్మ, గాజుకుంటపల్లి

వలస వెళ్లేందుకు సిద్ధం



ఖరీఫ్‌లో పంట సాగు చేయలేకపోయాం. మూడుఎకరాల మెట్ట భూమి ఉంది. వర్షాలు సమయానికి కురవక పోవడంతో పంట సాగు కాలం దాటిపోయింది. సాగుకోసం సిద్ధం చేసుకున్న విత్తనాలు కూడా ఊజీ పట్టాయి. స్థానికంగా పనులు, పంటలు లేక కుటుంబ పోషణ భారమవుతోంది. ఇప్పటికే పల్లెలో చాలమంది వలసలు వెళ్లారు. నేను కూడా వలస వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా.

-జెరిపిటి వెంకటరమణ, వెంకటాపురం

బతకడానికి...



బీళ్లుగా మారిన భూములు

- పంటలు పండక, ఉపాధి లేక..
- పల్లె ప్రజల పట్నం బాట
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- బీళ్లుగా మారిన పంట భూములు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పంటలు పండక, ఇతర ఉపాధి అవకాశాలు లేక బతకడానికి పల్లె జనం పెట్టేబేడా సర్దుకుని పట్నం బాట పడుతున్నారు. ఉపాధి పనులు కూడా అంతంతమాత్రంగానే కల్పిస్తుండటంతో గ్రామసీమల్లో బతకడం కష్టంగా మారింది. ఇప్పటికే ఓబుళదేవరచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల నుంచి చాలమంది వలస బాట పట్టారు. సాధారణంగా ఆగస్టు నెలలో వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉండే రైతులు, కూలీలు ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పంటలు సాగు చేయకపోవడంతో ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడింది.

ఆదుకోని ఉపాధి హామీ పథకం

వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా పనులు నామమాత్రంగా కల్పిస్తున్నారు. దీంతో పనుల కోసం కూలీలకు వలస తప్పడం లేదు. ఓబుళదేవరచెరువు మండలంలో 10,552 జాబ్‌కార్డులకుగాను 8,313మంది పనులు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 490మంది మాత్రమే పనులు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అమడగూరు మండలంలో 6,945జాబ్‌కార్డులకు గాను 5,667 మంది పనిచేయాల్సి ఉండగా, 122మంది పనులు చేస్తున్నారు. నల్లమాడలో 9,775కార్డులకు గాను 7,672మంది పనిచేయాల్సి ఉండగా, 426మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఉపాధి హామీ పథకం గురించి ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన ఉండటం లేదు.

సాగునీరు, పరిశ్రమలు వస్తేనే పరిష్కారం

అమడగూరు, ఓడీసీ, నల్లమాడ మండలాల్లో పరిశ్రమలకు అనువైన భూములున్నాయి. అయితే పరిశ్రమలు స్థాపించలేదు. గతంలో అమడగూరు, ఓడీసీ మండలాల్లో సైన్సుసిటీ పేరుతో భూములు సేకరించినా, ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. ఇటీవల ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఓడీసీలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువత, కూలీలకు ఉపాధి దొరుకుతుంది. మూడు మండలాల్లోని ప్రధాన చెరువులకు హంద్రీనీవా నీరు అందిస్తే ఈప్రాంతం సస్యశ్యామలంగా మారే అవకాశముంది. గత వైసీపీ ప్రభుత్వంలో 193 చెరువులకు నీరు అందిస్తామని పేర్కొన్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే చెరువులకు నీరు నింపాలని అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. ఎమ్మెల్యే దృష్టి సారించి 193చెరువులకు నీరు అందిస్తే వలసల నివారణకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల బోరుబావుల్లో నీరు అడుగంటుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. హంద్రీనీవా జలాల ద్వారా చెరువులను నింపితే భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తుంది.

బోర్లలో నీరు తగ్గాయి

వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ బోరుబావుల్లో నీరు తగ్గింది. నాకున్న ఆరు ఎకరాల్లో మూడు బోరు బావులు ఉన్నాయి. మూడు ఎకరాల్లో మొక్కజొన్న, మరో మూడు ఎకరాల్లో సజ్జ పంట సాగుచేశా. బోర్లలో రోజురోజుకు నీరు తగ్గుతోంది. దీంతో ఎప్పుడు ఏమవుతుందో అన్న భయం నెలకొంది. వ్యవసాయం చేయాలంటే భయమేస్తోంది. చెరువులను నీటితో నింపితే, బోరుబావుల్లో నీటి మట్టం పెరిగే అవకాశముంది.



-రెడ్డిపల్లి రాజారెడ్డి, నారప్పగారిపల్లి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు వచ్చి ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు సత్వరం స్పందించి, పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక 226 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారించి, గడువులోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డీపీఓ సమత, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను రద్దు చేయాలని ధర్మవరానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాసినేని ప్రభాకర్, తుం పర్తి పరమేష్, కాటమ్మ, అనిల్‌కుమార్ తదితరులు వినతిపత్రం అందించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్‌మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించిన టీడీపీ.. అధికారంలోకి రాగానే అదానీ సంస్థకు మే లు చేయడానికి స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని వారు ఆరోపించారు.

సమస్యలను వేగంగా పరిష్కరిస్తాం

మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఆదినారాయణ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను చట్టపరిధి లో వేగంగా పరిష్కరిస్తామని మహిళాపోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన బాధితుల సమస్యలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. మొత్తం 55 ఫిర్యాదులను స్వీకరించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, ఆర్థికమోసాలు, ఆస్తి పంపకాలు, సైబర్‌నేరాలు తదితర వాటిపై ఎక్కువగా ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఖాద్రీశుడి ఆర్జిత కల్యాణం



కల్యాణోత్సవంలో దేవేరులతో స్వామివారు

కదిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆర్జిత కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వసంతవల్లభుడు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్జిత కల్యాణం అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

లెక్కలేనంత..!

- రైస్‌మిల్లుల్లో భారీగా రేషన్ బియ్యం నిల్వ
- 210 టన్నుల మేర తరలింపు..
- ఇంకా పెద్దమొత్తంలో బస్తాలు
- ఇంకా తేలని లెక్క



రేషన్ బియ్యం నిల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్

యాడికి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యం నిల్వలు గుట్టలుగా బయటపడుతున్నాయి. యాడికిలో రేషన్ బియ్యం లెక్కలు కొలిక్కి రాలేదు. యాడికిలోని రైస్‌మిల్లుల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు సీజ్‌చేసిన సంగతి తెలిసిందే. ఆ బియ్యాన్ని సోమవారం లారీల్లో గుంతకల్లు పౌరసరఫరాల బఫర్ గోడౌన్‌కు తరలించారు. 7 లారీలు, బొలెరో వాహనంలో సుమారు 210 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలించారు. రైస్‌మిల్లుల్లో ఇంకా పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనీ, వీటన్నింటిని తరలించడానికి మరో 24గంటలు పట్టవచ్చని అధికారులు చర్చించుకుంటున్నారు. పూర్తిగా తరలిస్తే తప్ప.. ఎంత సీజ్ చేసినదీ చెప్పలేమని వారు పేర్కొంటున్నారు. రైస్‌మిల్లు వద్ద పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు పహారా నడుమ బియ్యాన్ని గుంతకల్లు పౌరసరఫరాల గోడౌన్‌కు తరలిస్తున్నారు. పరిస్థితిని సోమవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పర్యవేక్షించారు. ఇంత పెద్దమొత్తంలో ఎలా నిల్వ చేశారు, దీనివెనుక ఎవరెవరు ఉన్నారని వివరాలను ఆరాతీశారు. యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, పలువురు వీఆర్వోలు రైస్‌మిల్లు వద్ద ఉండి రేషన్ బియ్యం తరలింపునకు చర్యలు చేపడుతున్నారు.

సన్నబియ్యంగా మార్చి..

వివిధ ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, యాడికిలోని రైస్‌మిల్లులో సన్నబియ్యంగా మారుస్తున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి, అక్కడి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

కిలో రేషన్ బియ్యం రూ.17 నుంచి రూ.19

రేషన్ లబ్ధిదారుల నుంచి అక్రమంగా వ్యాపారం చేసేవారు కిలో బియ్యం రూ.17 నుంచి రూ.19కి కొనుగోలు చేస్తున్నారు. వీటిని యాడికిలోని రైస్‌మిల్లులో రూ.21 నుంచి రూ.23కి విక్రయిస్తున్నారు. వారు వీటిని ముడి సరుకుగానే కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు రూ.33కి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి కిలో రూ.45 నుంచి రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతినెలా రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ మొదలైనప్పట్నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఇదే వృత్తిగా మార్చుకున్న కొందరు వ్యక్తులు రేషన్ బియ్యం విక్రయించే వ్యక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి, ఒకచోట నిల్వ చేసుకుంటారు. వాటిని రాత్రివేళల్లో వివిధరకాల వాహనాల్లో రైస్‌మిల్లుకు తరలిస్తుంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అంగన్‌వాడీ బియ్యం కూడా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్‌లో భాగంగా పంపిణీ చేసిన సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం ప్యాకెట్లు కూడా రైస్‌మిల్లులో లభించడంపై అధికారులు విస్తుపోతున్నారు. అవి రేషన్ దుకాణాల నుంచి వచ్చాయా? అంగన్‌వాడీ కేంద్రాల నుంచి

(మిగతా 6లో..)

భోజన ఏజెన్సీల ఏడుపు..!

- ఇంటర్ కళాశాలల్లో ఎండీఎం అమలు
- ఏడు నెలలుగా అందని బిల్లులు
- అప్పులతో నెట్టుకొస్తున్న నిర్వాహకులు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

నల్లమాడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన(ఎండీఎం) ఏజెన్సీల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థుల కడుపు నింపుతున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. జూనియర్ కళాశాలల్లో జనవరి 4న ఈ పథకాన్ని అమలు చేశారు. సన్నబియ్యం, కోడిగుడ్లు, చిక్కీలను ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. విద్యార్థులకు మెనూ ప్రకారం ఏజెన్సీ నిర్వాహకులు కూరగాయలతో వంటలు చేసి పెడుతున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.8.57 ప్రభుత్వం అందిస్తోంది. మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగినా, అందుకు తగ్గ ఖర్చులు ప్రభుత్వం అందచేయకపోయినా, నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. ఏడు నెలలుగా ఒక్క రూపాయి కూడా భోజన ఏజెన్సీలకు అందలేదు. అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారేగానీ తమ గోడు పట్టించుకోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఏదో ఒకరోజు బిల్లులు వస్తాయన్న ఆశతో అప్పులు చేసి, ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి సరుకులు కొని పిల్లలకు వండి వడ్డిస్తున్నట్లు వారు చెబుతున్నారు. నల్లమాడ, అమడగూరు, తనకల్లు, కదిరి, కొత్తచెరువు జూనియర్ కళాశాలల్లో ఏజెన్సీ నిర్వాహకుల పరిస్థితి నీయంగా మారింది. అధికారులు తమ సమస్యలు గుర్తించి బిల్లులు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

రూ.లక్ష అప్పు చేశా: అమ్మాజాన్, నల్లమాడ



డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం నుంచి దాదాపు ఏడునెలల పాటు జూనియర్ కళాశాలలో 160మంది విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నాం. బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నాం. ఏడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో దాదాపు రూ. లక్ష అప్పు చేసి భోజనం పెట్టాం. ప్రభుత్వం బిల్లులు త్వరగా ఇస్తే వడ్డీ పెరగక ముందే అప్పు చెల్లించేస్తాం.

రెండు నెలల బిల్లు రావాలి: రమణ, తనకల్లు



తనకల్లులోని శ్రీగోవింద నరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు వందల మంది విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్నం భోజనం అందిస్తున్నాం. మేము రెండు నెలల కిందట ఈ ఏజెన్సీ తీసుకున్నాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా బిల్లు రాలేదు. సకాలంలో బిల్లులు అందచేస్తే మేము ఇబ్బందులు పడకుండా విద్యార్థులక భోజనాలు పెట్టడానికి అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని బిల్లులు త్వరగా అందించాలి.

బిల్లులు మంజూరు చేయండి: ఈశ్వరమ్మ, అమడగూరు



మేము అమడగూరు మండలంలోని జూనియర్ కళాశాలలో మూడు నెలల నుంచి విద్యార్థులకు డొక్కా సీతమ్మ పథకం ద్వారా భోజనం వడ్డిస్తున్నాం. కళాశాలలో 169మంది విద్యార్థులున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నాం. గత మూడునెలలుగా బిల్లులు పడలేదు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

త్వరలో అందజేస్తాం: క్రిష్టప్ప, డీఈఓ

జిల్లా వ్యాప్తంగా 21 జూనియర్ కళాశాలలున్నాయి. ఇక్కడ చదివే విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు జరుగుతోంది. భోజన ఏజెన్సీ నిర్వాహకులకు 7నెలలుగా బిల్లులు అందని మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో బిల్లులు అందించడానికి కృషి చేస్తాం.

పొట్టలో పురుగుల పనిపడదాం..!

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

6

ఎవరికెన్ని మార్కులో..!

టీచర్ డీఎస్సీ తుది మార్కులు విడుదల

ఊ అంటే వాన..!

- పంట పొలాల్లో నిలిచిన నీరు
- పలు ప్రాంతాల్లో కూలిన మిద్దెలు
- మరో మూడు రోజులు భారీ వర్షాలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)



వర్షపు నీటితో నిండుగా పారుతున్న మద్దెలచెరువు వంక

ఉమ్మడి జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. వదిలి వదిలి వానలు కురుస్తుండటంతో మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు పరిశీలించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నారు. పంట పొలాల్లో భారీగా నీరు నిల్వ ఉంటోంది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి సోమవారం తెలిపారు. అక్కడక్కడ గాలివానతో కూడిన వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పశువులు, గొర్రెలను రేకుల షెడ్లు, చెట్ల కింద ఉంచకుండా, సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు. భారీ వర్షం ఉన్న నేపథ్యంలో రైతులు పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు తీసివేయాలని సూచించారు. మొక్కజొన్న, వరి, కూరగాయల సాగు, నేల తయారీ పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు. పంట దిగుబడులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

నార్పలలో భారీ వర్షం

అనంతపురం జిల్లాలోని 27 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా నార్పలలో 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యల్లనూరులో 8.2, శింగనమల 3.0, పెద్దవడుగూరు 2.9, ఉరవకొండ 2.7, తాడిపత్రి 2.4, గార్లదిన్నె 2.2, పామిడి 2.0, గుత్తి 1.9, రాప్తాడు 1.8, పుట్లూరు 1.4, కూడేరు 1.3,అనంతపురం, పెద్దపప్పూరు 1.2, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం 1.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీ మీటరు లోపు వర్షపాతం నమోదైంది. యల్లనూరు

(మిగతా 6లో..)

నాకు నమ్మకం లేదు దొరా..!

- నా భార్య చనిపోతేనే పట్టించుకోలేదు
- సాక్ష్యాలను ఇస్తే మాయం చేశారు
- నాపైనే కేసు పెడతామని బెదిరించారు
- పోలీసు బాధితుడు.. ప్రవీణ్ ఆవేదన
- బుక్కరాయసముద్రంలో దగ్ధమైన బేకరీ



ప్రవీణ్

పొట్ట చేతబట్టుకుని రాష్ట్రం విడిచి వచ్చారు. చిన్నపాటి బేకరీ పెట్టుకుని పొట్టుపోసుకునేవారు. ఆ ఇంటి మహిళపై ఓ వ్యాపారి కన్ను పడింది. వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఇది జరిగి సుమారు ఐదు నెలలు. ఇంతలోనే వారి బేకరీ మంటల్లో తగలబడిపోయింది. 'అయ్యో పాపం..' అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 'పోలీసులకు ఫిర్యాదు చేశారా..?' అని బాధితుడిని అడిగితే.. 'నాకు వారిపై నమ్మకం లేదు..' అని నిర్వేదంతో అన్నారు. నా భార్య చావుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదు. ఆధారాలు ఇచ్చినా స్పందించలేదు. పైగా నేను మందలించినందుకే తాను ఆత్మహత్య చేసుకుందని ఎదురుదాడికి దిగారు. ఇంతటితో వదిలేయకుంటే నాపైనే కేసు పెడతామని బెదిరించారు అని వాపోయాడు. బుక్కరాయసముద్రం సమీపంలో బేకరీ నిర్వహిస్తున్న ప్రవీణ్ దీన గాథ ఇది. కర్ణాటకకు చెందిన ప్రవీణ్.. భార్యను, ఆస్తిని పోగొట్టుకుని ఇద్దరు బిడ్డలతో రోడ్డున పడ్డారు. అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం ఇష్టంలేక, తహసీల్దారుకు అర్జీ ఇచ్చారు. ఆదుకోవాలని విన్నవించారు.


- వివరాలు 6లో...

అందాలలో.. అహో


తాజా తాజా చేప..


పొలుసు తీసి.. పులుసు పెడదాం..!


బండరాతికి చిల్లు పడిందే..


రెక్కలు లేకున్నా.. ఇక్కడి చేప గాలిలో తేలిపోతుంది


అందాల నడుమ ఆపద పొంచే ఉంటుంది.. జాగ్రత్త..!

పెన్నహోబిలం శోభాయమానంగా మారింది. క్షేత్ర సమీపంలో పచ్చని చెట్ల నడుమ, బండరాళ్లపై నుంచి జలజల దూకుతూ.. గలగల పారుతున్న తుంగభద్ర జలాలు కనువిందు చేస్తున్నాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతిని పొందుతున్నారు. తుంగభద్ర డ్యాం నీరు హెచ్చెల్సీ ద్వారా మిడ్ పెన్నార్ డ్యాం వైపు పరుగులు తీస్తోంది. ఏటా ఈ సమయంలో పెన్నహోబిలంలో సందడి మొదలౌతుంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. పారే నీటిలో ఎగిరే చేపలను పట్టుకునేందుకు కొందరు వలలు చెట్లకు కట్టి వేట సాగిస్తున్నారు.


- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


నీటిలోని చేపలంట.. ఎగిరెగిరి దొరికెనంట..

ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తు

సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి



మడకశిర, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషన్ ఎన్ని అవకతవకలు చేయాలో అన్నీ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆయన ఈసీపై విరుచుకుపడ్డారు. సీసీ ఫుటేజీ, ఓటరు జాబితా వంటి కీలక సమాచారాన్ని దాయడం, పారదర్శకత పాటించకపోవడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియ నుంచి సుప్రీం కోర్టు జడ్జిని తప్పించడం, అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఎన్నికల తేదీలను మార్చడం, కొన్ని రాష్ట్రాల్లో 7, 8 విడతల్లో పోలింగ్ నిర్వహించడం, హరియాణాలో సీసీ ఫుటేజీ అడిగితే ఇవ్వలేదని, మహారాష్ట్రలో నాలుగు నెలల వ్యవధిలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. ఆ స్వల్ప కాలంలో 50 లక్షల ఓట్లు చేర్చడం తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ఓట్ల చౌర్యానికి సంబంధించిన అన్ని ఆధారాలను రాహుల్ గాంధీ ఆదివారం బెంగళూరులో బయట పెట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు బిహార్‌లో 65 లక్షల ఓట్లను తీసివేస్తున్నారని, తొలగించిన ఓటర్ల జాబితా అడిగితే ఇవ్వడం కుదరదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, ఆధార్‌ను పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిజిటల్ ఓటర్ల జాబితా, సీసీ ఫుటేజీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అడుగుతోందని, ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఆధారాలతో మాట్లాడుతుంటే ఆయనకు నోటీసులు ఇచ్చి ఎన్నికల కమిషన్ తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని అనుకుంటోందని అన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తుగా మారిందని ఆరోపించారు. అక్రమాలకు బాధ్యత వహించి, కేంద్ర ప్రభుత్వం అధికారం నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రపతి కలుగ జేసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని టైమ్‌బౌండ్ ఎంక్వయిరీ చేయించాలని కోరారు. ఎన్నికల కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని కోరారు. ఐరిష్ విధానంలో ఈ-ఓటర్ ఐడీ కార్డును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎవరికెన్ని మార్కులో..!

టీచర్ డీఎస్సీ తుది మార్కులు విడుదల

807 పోస్టులు...45,186 మంది పోటీ

నియామకాలకు యంత్రాంగం అడుగులు



అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ తుది మార్కులను సోమవారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసింది. అనంతపురం ఉమ్మడి జిల్లాకు అన్నికేడర్లకు సంబంధించి 807 టీచర్ పోస్టులు మంజూరు చేశారు. ఇందులో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో అన్ని కేడర్లకు కలిపి 564పోస్టులు, గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ కింద 97 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్ 62, మున్సిపల్ మేనేజ్‌మెంట్ కింద 84పోస్టులు, కేటాయించారు. ఈపోస్టులకు ఉమ్మడి జిల్లాలో 45,186మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈ ఏడాది జూన్ నుంచి జూలై వరకు పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాలను సోమవారం రాత్రి ప్రభుత్వం ప్రకటించింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మార్కులు చూసుకునేలా లింక్ పెట్టారు. దీంతో ఏఅభ్యర్థికి టాప్ ర్యాంకు వచ్చిందో తెలుసుకోవడానికి కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రభుత్వం జిల్లాల వారిగా మెరిట్ లిస్టులు విడుదల చేస్తే అపుడు ఏ సబ్జెక్టులో ఏ అభ్యర్థికి టాప్ మార్కులు వచ్చాయో తెలుస్తుందని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. కాగా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. మొత్తం మీద పరీక్షలు ముగిసిన నెలల వ్యవధిలోనే తుది మార్కులు ఇవ్వడంపై డీఎస్సీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. 'ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యా సంస్థల నిబంధనలు-2025' పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది. ఇందుకోసం వేర్వేరుగా కమిటీలు నియమించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రూల్స్ అమల్లోకి వస్తాయి.

పొట్టలో పురుగుల పనిపడదాం

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా ప్రత్యేక చర్యలు


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

కదిరిఅర్బన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): నులిపురుగు.. పిల్లల పాలిట శాపం. వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన పిల్లల కడుపులో నులిపురుగు పెరుగుతూ.. బరువు తగ్గేందుకు కారణమవుతుంది. రక్తహీనత, పోషకలోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, బలహీనంగా తయారవడం దీని లక్షణాలు. ఏలికపాము, నులి, కొంకి ఇలా మూడు రకాల పురుగులు కలిగి ఉన్న పిల్లలు క్రమేణా బరువు తగ్గిపోతూ అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడతారు. పిల్లల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఫిబ్రవరి 10, ఆగస్టు 12న నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తోంది.

నులిపురుగుల వ్యాప్తి

ఈగలు, దుమ్ము, ధూళి పడి కలుషితంగా మారిన తినుబండారాలను తీసుకోవడం ద్వారా పిల్లల కడుపులో నులిపురుగు వ్యాప్తి చెందుతుంది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, వంట సరుకులను శుభ్రమైన నీటితో కడగకపోవడం, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడంతో అనేక అనర్థాలు ఉంటాయి. నులి పురుగులు చిన్నారుల పొట్టలో స్థావరం ఏర్పరచుకుని వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసున్న వారు 3,66,225 మంది ఉండగా... వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

ఎదుగుదలకు అడ్డంకి

చిన్నపిల్లల శరీరంలో తెలియకుండానే నులి పురుగులు ఉండడంతో శారీరక ఎదుగుదల మందగిస్తుంది. మానసిక ఎదుగుదల లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పేగుల్లో నులి పురుగులు ఉండడంతో తీసుకున్న ఆహారాన్ని అంతా అవే గ్రహించడంతో శరీరానికి పోషకాలు అందక ఎదుగుదల లోపిస్తుంది. ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పిల్లల్లో ఏకాగ్రత కూడా నశిస్తుంది. రెండేళ్లు పైబడిన పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలున్నాయి. నులి పురుగులు శరీరంలో ఉన్నట్లు గుర్తించడానికి సమయం పడుతుంది. పిల్లలు వయసుకు తగ్గ ఎదుగుదల, బరువు, మానసిక పరిపక్వత లేకపోవడం వంటి సమస్యలుంటే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి. సకాలంలో గుర్తించి మందులు వాడితే నులిపురుగుల బారి నుంచి పిల్లలను కాపాడుకోవచ్చు.

నివారణ చర్యలు

భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. సురక్షిత, కాచి వడబోసిన నీటినే తాగాలి. ఏదైనా తిన్న తరువాత, మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తీపి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. మలబద్ధకం రాకుండా చూసుకోవాలి. పీచుపదార్థాలతో కూడిన ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదు.

మాత్రల డోస్ ఇలా..

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర (200 ఎంజీ) నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు పూర్తి మాత్ర పొడిచేసి నీటిలో కలిపి తాపాలి. 3 నుంచి 19 ఏళ్ల వారికి 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. ప్రతి ఆర్నెల్లకోసారి మాత్ర వేసుకోవాలి. అనారోగ్యంగా ఉన్న వారికి, ఇతర మందులు వాడుతున్న పిల్లలకు మాత్ర వేయకూడదు.



విధిగా మాత్రలు మింగించాలి

1 నుంచి 19 సంవత్సరాల వయసులోపు వారందరికీ విధిగా అల్బెండజోల్ మాత్రలు మింగించాలి. ఇందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలి. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, టీచర్లు, అధ్యాపకుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత మాత్ర వేసేలా చర్యలు తీసుకున్నాం. అపోహలు లేకుండా మాత్రలు మింగించి, నులిపురుగుల నిర్మూలనలో భాగం కావాలి.

- ఫైరోజ్ బేగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

నాకు నమ్మకం లేదు దొరా..!

- నా భార్య చనిపోతేనే పట్టించుకోలేదు
- సాక్ష్యాలను ఇస్తే మాయం చేశారు
- నాపైనే కేసు పెడతామని బెదిరించారు
- పోలీసు బాధితుడు.. ప్రవీణ్ ఆవేదన
- బుక్కరాయసముద్రంలో దగ్ధమైన బేకరీ


కాలిపోతున్న బేకరీ


సితార (ఫైల్)


సూసైడ్ నోట్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద అయ్యంగార్ బెంగళూరు బేకరీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఏడాది క్రితం బుక్కరాయసముద్రంలో ఈ బేకరీని ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం వేకువజామున ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో బేకరీలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గమనించిన స్థానికులు.. పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. బేకరీలోని రెండు గ్యాస్ సిలిండర్లు ఒకదాని తరువాత ఒకటి పేలాయి. దీంతో మంటలను ఆర్పడం కష్టంగా మారింది. అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో అటు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు ఆపేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. చుట్టుపక్కల ఉన్న వారిని అప్రమత్తం చేశారు. గ్యాస్ సిలిండర్లు పేలిన అనంతరం మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పి వేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న యంత్రాలు, ఫ్రిజ్‌లు, ఫర్నిచర్, నగదు, మెటీరియల్ తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ప్రవీణ్ తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయబోనని బాధితుడు అన్నారు. తనకు వారు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కుండబద్ధలు కొన్నారు. ఓ వ్యక్తి వేధింపుల కారణంగా తన భార్య ఆత్మహత్య చేసుకుందని, ఈ విషయంలో పోలీసులు తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అందుకే.. నమ్మకం లేదు..

ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్, సితార దంపతులు అనంతపురానికి వలస వచ్చారు. కక్కలపల్లి సమీపంలోని టమోటా మార్కెట్ వద్ద బేకరీ ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఓ టమోటా వ్యాపారి తరచూ బేకరీ వద్దకు వస్తుండేవాడు. అలా సితారతో పరిచయడం పెంచుకున్నాడు. కొన్నిసార్లు స్నేహపూర్వకంగా ఫోన్‌లో మాట్లాడాడు. వాట్సాప్ చాటింగ్ కూడా చేశాడు. ఇదే అదునుగా సితారను లైంగికంగా వేధించడం మొదలెట్టాడు. వాటిని భరించలేక సితార ఈ ఏడాది మార్చి 14వ తేదీ రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 'అన్ని ఆధారాలు అప్పట్లో ఇచ్చినా. ఇప్పుడు ఏమీ లేవని అంటున్నారు. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సితార సూసైడ్ నోట్‌లో రాసింది. అతని పేరు కూడా రాసింది..' అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు పిలిపించి తూతూమంత్రంగా విచారించి వదిలేశారని సమాచారం. వివాహేతర సంబంధం నేపథ్యంలో సితారను భర్త ప్రవీణ్, కుటుంబ సభ్యులు మందలించడంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు.

సెటిల్‌మెంట్ కోసం బెదిరింపులు

భార్య చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తనను గతంలో పనిచేసిన పోలీసు అధికారి 'సెటిల్ చేసుకో.. లేకపోతే నువ్వేకొట్టావని కేసు నమోదు చేస్తా' అని బెదిరించాడని ప్రవీణ్ కన్నీటి పర్యంతమయ్యారు. సూసైడ్ లెటర్‌ను పరీక్షలకు పంపాల్సిన బాధ్యత మరచిన పోలీసులు, 'నీ భార్యే రాసిందని ఏమి ప్రూఫ్' అని ఎదురు ప్రశ్న వేశారట. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని అడిగినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయాడు.

విచారణ చేయిస్తాం..

సితార ఆత్మహత్య విచారణ విషయం మా దృష్టికి రాలేదు. వేధింపులకు పాల్పడినట్లు రుజువైతే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఇలా జరిగిందని ఏ రోజూ బాధితులు ఫిర్యాదు చేయలేదు.

- వెంకటేశులు, డీఎస్పీ

రుజువు కాలేదు..

సితార మృతి కేసులో టమోటా వ్యాపారిని పిలిపించి విచారించాం. పరిచయం మాత్రమే ఉన్నట్లు తెలిసింది. సెల్ సంభాషణ, బేకరీ వద్ద మాట్లాడినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. వేధించినట్లు రుజువు కాలేదు. సూసైడ్ నోట్‌కు సంబంధించి ఆధారాలు తీసుకొస్తే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతాం. ఆమె రాసినదేనని తేలితే టమోటా వ్యాపారిపై చర్యలు తప్పవు.

-పుల్లన్న, సీఐ


సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని లారీలో లోడింగ్ చేస్తున్న సిబ్బంది

లెక్కలేనంత..!

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చారా అనేది సందేహాస్పదంగా మారింది. దీనిపై లోతుగా దర్యాప్తు చేపడితే తప్ప.. నిజం బయటకు రాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎటువంటి చర్యలు చేపడతారో?

పెద్దఎత్తున రేషన్ బియ్యం సీజ్‌చేసిన అధికారులు అందుకు బాధ్యులపై ఎటువంటి చర్యలు చేపడతారోనని స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అన్నింటిని అక్కడి నుంచి తరలిస్తే తప్ప.. ఎటువంటి చర్యలు తీసుకునేదీ వెల్లడించలేమని అధికారులు గుసగుసలాడుతున్నట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఊ అంటే.. వాన..!


యల్లనూరు మండలంలో భారీ వర్షానికి పొలాల్లో నిలిచిన వర్షపునీరు

(5వ పేజీ తరువాయి)

మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని తహసీల్దారు రాము తెలిపారు. వాగుల నుంచి వచ్చే నీరు చిత్రావతి నదిలో కలవడంతో ప్రవాహ వేగం పెరిగింది. యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. తాడిమర్రి మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురిసింది. వంకలు పొంగి పొర్లుతున్నాయి. మద్దెలచెరువు వంక పారడంతో తూర్పుచెరువుకు నీరు చేరింది. ఐదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పండ్ల తోటల రైతులు ఊపిరిపీల్చుకున్నారు. మరో 15 రోజులపాటు చీనీ చెట్లకు నీటిని ట్యాంకర్ల ద్వారా తోలాల్సిన అవసరం ఉండదని కునుకుంట్ల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.


నిండిన తాడిమర్రి తూర్పు చెరువు

కూలిన మిద్దెలు

భారీ వర్షాలకు పరిగి మండల కేంద్రంలో బైరెడ్డికి చెందిన పాతమిద్దె కూలిపోయింది. గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆర్ఐ సిద్దేశ్, వీఆర్ఓ సుధాకర్‌స్వామి పరిశీలించారు. పాత మిద్దెలున్నవారు ముందుగానే తమకు సమచారం ఇవ్వాలని, కూలిన 24గంటల్లోనే తమకు తెలపాలని సూచించారు. బెళుగుప్ప మండల కేంద్రం, ఎర్రగుడి గ్రామంలో రెండు ఇళ్లు నేలకూలాయి. యలగలవంక గ్రామానికి చెందిన వేదమూర్తి ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. నార్పల వడ్డే కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. రామకృష్ణ కుటుంబ సమేతంగా ఇంట్లో నిద్రిస్తుండగా ఒక మూలన గోడ పడిపోంది. వెంటనే అందరూ బయటకు వెళ్లిపోయారు. ఆ తరువాత అరగంటలోనే ఇల్లు మొత్తం కూలిపోయింది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, తిండిగింజెలు పాడైపోయాయి. రెవెన్యూ అధికారి రామకృష్ణ ఇంటిని పరిశీలించారు. ధర్మవరం మండలంలోని పోతుకుంట, రావులచెరువు గ్రామాల్లో వర్షానికి సోమవారం రెండు ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ సురేషబాబు తెలిపారు. అత్యవసర సాయం కోరం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సెల్ నంబర్ 9553929724కు సమాచారం అందించాలని కోరారు.


నార్పల వడ్డే కాలనీలో కూలిన ఇల్లు

క్రైం కార్నర్

చిన్నారిపై హత్యాచారం కేసులో యావజ్జీవం

● తీర్పునిచ్చిన స్పెషల్ కోర్టు న్యాయాధికారి


నిందితుడు గంగాధర్ (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు గంగాధర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కేసు వివరాలు ఇలా... కర్ణాటక రాష్ట్రం నామగుండ్ల గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని హిందూపురం మండలం తూముకుంట గ్రామంలో ఉన్న తన సొంత అక్క ఇంటికి వచ్చారు. అయితే అక్క భర్త(బావ) గంగాధర్ ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని గత ఏడాది ఆగస్టు 2న సమీప పొలాల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, ఆపై హత్యచేసి పెన్నానది ఒడ్డున పూడ్చేశాడు. ఎంతసేపటికీ చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఆందోళనతో వెదికింది. దీంతో చుట్టు పక్కల ఉన్న వారు చిన్నారిని గంగాధర్ తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో ఆమె గట్టిగా నిలదీశారు. చుట్టుపక్కలవారు సైతం గంగాధర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో చంపేసి పూడ్చినట్లు ఒప్పుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో 17మంది సాక్షులను విచారించగా నేరం రుజువైంది. దీంతో అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సోమవారం గంగాధర్‌కు యావజ్జీవ కారాగారశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే సాక్ష్యాన్ని తారుమారు చేసేందుకు చిన్నారి శవాన్ని పూడ్చడంపై ఐదేళ్ల జైలుశిక్ష, మరో రూ.10వేలు జరిమానా విధించారు. ఈ కేసు పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, నిందితుడికి శిక్షపడేలా చేసిన డీఎస్పీలు కంజక్షన్, మహేష్, సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసులును జిల్లా ఎస్పీ అభినందించారు.

డ్రైనేజీలో పడి చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి థియేటర్ వద్ద డ్రైనేజీ కాలువలో పడి చేనేత కార్మికుడు సుపారి నాగరాజు (60) సోమవారం మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బసవన్నకట్ట వీధికి చెందిన సుపారి నాగరాజు పట్టుచీరలు మడతలు వేస్తూ జీవించేవాడు. తరచూ మద్యం తాగేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి, శ్రీదేవి థియేటర్ సమీపంలోని గ్రంథాలయం ఎదురుగా డ్రైనేజీ పక్కన పడిపోయాడు. రాత్రి వర్షం రావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటి ప్రవాహానికి డ్రైనేజీలోకి పడిపోయి, చనిపోయాడు. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు.. డ్రైనేజీని శుభ్రం చేస్తుండగా నాగరాజు మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి, అతడి కుమారుడు మనోహర్‌కు సమాచారం అందించారు. మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నాగరాజు భార్య గతంలోనే మరణించింది.

పిచ్చికుక్క స్వైరవిహారం.. ఐదుగురిపై దాడి

ఉరవకొండ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పిచ్చికుక్క సోమవారం స్వైరవిహారం చేసింది. పాత స్టేట్ బ్యాంకు, జైనబ్బీ దర్గా, కవిత హోటల్, టవర్ క్లాక్ కూడలిలో పలువురిపై దాడిచేసింది. వివిధ పనుల నిమిత్తం ఉరవకొండకు వచ్చిన చిన్నముష్టూరు, పొట్టిపాడు, చిన్నహోతూరు గ్రామాలకు చెందిన వారిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో రాము, ఓబులేశు, నారాయణ, రామాంజనేయులు మరో వ్యక్తి గాయపడ్డారు. వారిని ప్రథమ చికిత్స కోసం ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు.

రూ.36 లక్షల ఎయిర్ ఫైబర్ రూటర్ చోరీ


ఎయిర్‌ఫైబర్ రూటర్ గది

గాండ్లపెంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే ఎయిర్ ఫైబర్ రూటర్ సామగ్రి శనివారం చోరీ అయినట్లు సిబ్బంది సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ ఎయిర్‌ఫైబర్ సిబ్బంది రాజు తెలిపిన మేరకు.. సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే రూటర్ సామగ్రిని అమర్చారన్నారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ గదిలోకి ప్రవేశించి, అందులోని రూటర్‌ను తీసుకెళ్లారన్నారు. అక్కడున్న సిబ్బంది ప్రశ్నించగా, తాము ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ సమాధానమిచ్చినట్లు తెలిపారు. రూటర్‌ను కారులో తీసుకెళ్లినట్లు వివరించారు. తాము ఆదివారం గమనించడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈవిషయంపై ట్రైనీ ఎస్ఐ రవికుమార్‌ను వివరణ కోరగా, తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఎయిర్ ఫైబర్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

● వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలో ఉంటున్న మహిళ, ఆమె భర్త ఏడాది క్రితం బత్తలపల్లిలో ఉండేవారు. అక్కడ అక్కడ కిరాణా షాపు నిర్వహిస్తుండేవారు. ఆ సమయంలో బత్తలపల్లికే చెందిన బోయ గోపాల్ అప్పుడప్పుడు దుకాణానికి వస్తుండేవాడు. ఆ పరిచయంతో సదరు మహిళ ఫోన్ నంబరు తీసుకుని, చనువుగా మాట్లాడేవాడు. ఆ తరువాత ఆమె మాట్లాడిన మాటలను రికార్డు చేశాడు. వాటిని వినిపిస్తూ తనకు డబ్బు ఇవ్వాలనీ, లేకపోతే కోరిక తీర్చాలని ఆమెను గోపాల్ వేధించేవాడు. 'లేదంటే నీ భర్తకు చూపిస్తాను'టూ బెదిరించేవాడు. విషయాన్ని సదరు మహిళ.. భర్తకు చెప్పింది. దీంతో బత్తలపల్లి నుంచి ధర్మవరానికి వచ్చేశారు. అయినా గోపాల్... వేధింపులు ఆగలేదు. ఈనెల 7వ తేదీన రాత్రి చందన ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకున్న గోపాల్ అర్ధరాత్రి దాటాక తలుపులు గట్టిగా కొట్టసాగాడు. ఎవరో అని సదరు మహిళ తలుపులు తీసింది. గోపాల్ తనతో వస్తావా.. లేదా.. అంటూ నానా దూర్భాషలాడుతుండటంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో గోపాల్ పరారయ్యాడు. ఈ మేరకు బాధిత మహిళ సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

బడిలో భయం..!

● శిథిలావస్థలో తరగతి గదులు
● పరిగిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో భద్రత గాలికి..
● కూలే స్థితిలో గోడలు.. స్కూల్ చుట్టూ ఇటుక బట్టీలు
● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
● పెచ్చులూడిపడిన కె.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పైకప్పు

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాత భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే చిన్నారులు రోజు వెళ్లే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిస్థితులపై ఆందోళన నెలకొంది. వాటి యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని, టీచర్లు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇందుకు కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కూడా మినహాయింపు కాదు. ఉన్నతాధికారుల ఉదాశీన వైఖరిలో పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వర్షానికి చెమ్మెక్కిన పాఠశాల వెనుక గోడలు


పాఠశాలకు ఆనుకుని ఉన్న ఇటుక బట్టీలు

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీరంగరాజుల పల్లి రహదారిలో ఎనిమిదేళ్ల కిందట వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి తాత్కాలికంగా భవన అనుమతులు పొంది బెల్లా పాఠశాలను ఏర్పాటు చేశాడు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ఫీజులు బాగానే వసూలు చేస్తూ పిల్లల భద్రతను మాత్రం మరిచిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల గదులకు చెమ్మ వచ్చి, కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే కిటికీల నుంచి తరగతి గదుల్లోకి నీరు వస్తోంది. పునాదులు లేకుండా గోడలు నిర్మించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అలాగే పాఠశాల చుట్టూ ఇటుకల బట్టీలు ఉండటంతో దాని నుంచి వచ్చే పొగ పీల్చి విద్యార్థులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. దాదాపు 300మందికిపైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, విద్యార్థులను ప్రమాదం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

● ఈ విషయంపై కరస్పాండెంట్ వర్గీస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాను పాఠశాలలో లేనని సొంతపనిపై కేరళ వచ్చానని బదులిచ్చారు. ఇటుక బట్టీల మధ్యలో గదులు ఎందుకు నిర్మించారని ప్రశ్నించగా తానిప్పుడు సమాధానం ఇవ్వలేనని ఇతర పనుల్లో ఉన్నానని కాల్ కట్ చేశారు.

చర్యలు తీసుకుంటాం: లక్ష్మీదేవి, ఎంఈఓ



పునాదులు లేకుండా తరగతి గదులను నిర్మిస్తే, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి రాబోయే కాలంలో గుర్తింపు రద్దు చేస్తాం. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల గదులు దృఢంగా నిర్మించాలి. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

వానొస్తే పెచ్చులూడుతున్నాయ్..!


పెచ్చులూడిన పై కప్పు నుంచి కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కే.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్న వర్షం వచ్చినా పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఆ అంగన్‌వాడీ సెంటర్ భవనం పైకప్పు పెచ్చులు సోమవారం కూడా ఊడిపడటంతో సిబ్బంది, పిల్లలు తీవ్ర ఆందోళన చెందారు. పైకప్పు పెచ్చులూడిపోయి, అందులో ఉన్న ఇనుప కడ్డీలన్నీ బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరంతా లీకేజీ అవుతూ, గది మొత్తం తడిసిపోయింది. 35 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం అంతా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ అంగన్‌వాడీ కేంద్రానికి 20 మంది దాకా పిల్లలు వస్తున్నారు. భవనం పెచ్చులూడిపడుతుండటంతో వారందరినీ ఆరు బయటే కూర్చోబెడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో, అంగన్‌వాడీ సెంటర్‌కు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆరుబయటే కూర్చున్న పిల్లలు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించండి

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో హోం శాఖ మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధుల బృందం

అనంతపురం/పుట్టపర్తి ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కోరారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను పార్లమెంట్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్‌రాజు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సోమవారం కలిశారు. ఆర్డీటీ సేవలకు సహకరించాలని కోరడంతోపాటు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. అత్యంత వెనుకబడిన, దుర్భిక్ష ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంగా ఐదున్నర దశాబ్దాలుగా ఆర్డీటీ ప్రజలకు అనేక రూపాల్లో అందిస్తున్న సేవలను వారు హోం మంత్రికి వివరించారు. 2021 నుంచి ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణలో కలుగుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విదేశీ విరాళాల విషయంలో ఆంక్షల వల్ల సంస్థ కొనసాగిస్తున్న కార్యకలాపాలకు అవరోధం ఏర్పడిందని తెలిపారు. కేంద్ర హోం శాఖ సూచన మేరకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణకు ఆర్డీటీ మూడు నెలల కిందట దరఖాస్తు సమర్పించిందన్నారు. ఆ దరఖాస్తును పరిశీలించి, సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని వారు అమిత్‌షాను కోరారు. అనంతపురం జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఆర్డీటీ విశేష సేవలు అందిస్తోందని వారు హోం మంత్రికి వివరించారు. అలాంటి సంస్థ కార్యకలాపాలు మరింత విస్తృతం చేయడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు బృందం విజ్ఞప్తికి హోం మంత్రి సానుకూలంగా స్పందించడంతోపాటు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసినందుకుగాను హోంమంత్రిని, కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ ప్రతినిధుల బృందం అభినందించింది.


కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో చర్చిస్తున్న టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం

ఉద్యోగాల పేరుతో రూ.13 లక్షల మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వివిధ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగులకు రూ.13 లక్షలు మోసం చేసిన ఉదంతం మండలంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనుంపల్లికి చెందిన సుధాకర్, రవిరాజు అన్నదమ్ములు. గ్రామంలోనే ఆర్మీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తుండేవారు. వివిధ ప్రాంతాల నుంచి యువకులు అందులో చేరారు. కోచింగ్ పూర్తి చేసుకుంటే ఆర్మీ, రైల్వే వివిధ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన కొంతమంది యువకులు ఉద్యోగాలు వస్తే తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. వారు అడిగినంత డబ్బును ముట్టజెప్పారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన రామాంజనేయులు మూడేళ్ల క్రితం కనుంపల్లి ఆర్మీ కోచింగ్ సెంటర్‌లో చేరాడు. గార్లదిన్నెకు చెందిన రవితేజ కూడా చేరాడు. రామాంజనేయులుకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పడంతో గతేడాది విడతల వారీగా రూ.10లక్షల వరకు రవిరాజు తీసుకున్నాడు. రవితేజ కూడా రూ.3 లక్షల వరకు ఇచ్చాడు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో డబ్బు వాపసు ఇవ్వాలని వారు ఒత్తిడి చేశారు. భూమి విక్రయానికి పెట్టామనీ, అమ్మడవగానే డబ్బు ఇస్తామని అదిగో... ఇదిగో అంటూ కాలయాపన చేశారు. దీంతో బాధితులు.. చివరకు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్. ముద్దిరెడ్డిపల్లికి చెందిన సీకే గంగాధరప్ప (44) సోమవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగాధరప్ప రైతు. మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా విపరీతంగా మద్యం తాగాడు. మద్యం సేవించడానికి కుటుంబ సభ్యులు డబ్బు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. గంగాధరప్ప భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ. 27, సరాసరి ధర రూ. 34 పలికాయన్నారు. మార్కెట్‌కు 3,375 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే


గ్యారేజీలో కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే

కదిరి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను వారు సోమవారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ప్రయాణికులతో మాట్లాడారు. కదిరి బస్టాండ్ నుంచి డిపో వరకు రూ.20లక్షలతో రోడ్డు నిర్మిస్తామన్నారు. రూ.8కోట్లతో కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో 16 టెర్మినల్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అధునాతనమైన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. మరో రెండు నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడుపుతామన్నారు. వారి వెంట డీఎం మైనుద్దీన్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సెక్టోరల్స్‌కు ఇంటర్వ్యూలు ప్రారంభం


సెక్టోరల్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆరు పోస్టులకు 47మంది టీచర్లు అర్హుల జాబితాలోకి వచ్చారు. వీరందరికీ ఇంటర్వ్యూలు ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో సోమవారం ఇంటర్వ్యూలు మొదలు పెట్టారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు 25మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 22మంది హాజరైనట్లు ఏపీసీ శైలజ తెలిపారు. మిగిలిన 22 మంది టీచర్లకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఏపీసీ తెలిపారు.

మాతాశిశు మరణాలు జరగకూడదు

● ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లీ చనిపోకూడదని, ఏ శిశువూ జన్మించే సమయంలో మృతి చెందకూడదని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్‌తో సోమవారం సమీక్ష నిర్వహించారు. కూడేరు, నాగసముద్రం, విడపనకల్లు, అంబేడ్కర్ నగర్ పీహెచ్‌సీలలో జరిగిన తల్లి మరణాల గురించి సమీక్షించారు. జిల్లాలో తల్లి మృతి చెందినప్పుడు, మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురయ్యాయి, అందుకు కారణాలు తెలుసుకోవాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి కారణంతో మరణం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరణాలను నివారించడానికి వైద్యశాఖలో ఉన్న సూపర్‌వైజర్, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇకపై మాతృ మరణాలు జరిగినచోట తానే స్వయంగా వచ్చి విచారిస్తానని అన్నారు. ప్రతి గర్భిణికి 12 వారాల్లోపు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రమాదకర లక్షణాలున్న స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, తక్కువ ఎత్తు, గర్భంలో ఉమ్మనీరు తక్కువ, బిడ్డ పెరుగుదల లేకపోవడం వంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని సూచించారు. శిశు మరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

న్యూస్ బాక్స్

జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక




హర్షియానేహా, తేజశ్వణి

కదిరి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారంనుంచి అనంతపురంలో జరగనున్న దక్షిణ మండల అంతర్‌జిల్లాల సీనియర్స్ మహిళా జట్టుకు కదిరి క్రీడాకారిణులు ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. క్రికెట్‌లో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న కదిరి క్రీడాకారిణులు హర్షియానేహా, తేజశ్వణి ఎంపికైనట్లు వివరించారు. హర్షియా గత ఏడాది అండర్-19 రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, తేజశ్వణి అండర్-15 రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపిక కావడంపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహానికి స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పునడింపల్లి మూడురోడ్లకూడలిలో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని టీడీపీ నాయకులు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయకుల సహకారంతో ఇప్పటికే ఎన్టీఆర్ విగ్రహాన్ని తయారుచేయించామన్నారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు.

సాగునీరు అందించండి

నంబులపూలకుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా మండలానికి సాగునీరు అందించాలని రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హంద్రీనీవా పనులు చేపట్టి రెండు దశాబ్దాలవుతోందని, నేటికి మండలానికి సాగునీరు రాలేదన్నారు. కాలువలు ఇప్పటికే ముళ్లపొదలతో నిండిపోయాయని, వాటిని తొలగించి, చెరువులను నింపాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నాగిరెడ్డి, నాగరాజు, చిన్న మల్లిరెడ్డి, గుర్రప్ప, ఈశ్వర్‌రెడ్డి, బాలాజీ, వెంకటయ్య, జలందర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ తుమ్మల పర్వీన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్నిశాఖలపై సమీక్షిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఈనెల 2,3 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయికి ఎంపికైనట్టు హెచ్ఎం జ్యోతి తెలిపారు. పాఠశాల విద్యార్థినులు 4-14, 4-19 విభాగాల్లో పాల్గొని 4-14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు 4-14 విభాగంలో ఏడుగురు, 4-19 విభాగంలో ఏడుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని తెలిపారారు. వీరు బీహార్ రాష్ట్రంలో సెప్టెంబరు నెలలోజరిగే జాతీయస్థాయిపోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని సోమవారం పాఠశాలలో హెచ్ఎంతో పాటు, పీడీ లక్ష్మీనారాయణ, పీఈటీలు లక్ష్మీనారాయణ, పద్మావతి అభినందించారు.

షూటింగ్‌బాల్ పోటీలకు..



షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ అసోసియేషన్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలలో రిషి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్ సింగ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సిరి, శాలిని, షణ్ముకకుమార్‌రెడ్డి సెప్టెంబరులో జరిగే జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. వారితో పాటు సీఏఓ రవీంద్ర, ఏఈ రంగారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కల్యాణి, పీఈటీ గణేశ్ విద్యార్థులను అభినందించారు.

అయ్యప్పకు ప్రత్యేక అభిషేకాలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా వరుసగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప సన్నిధిలో సోమవారం అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ సంకల్పకుడు పచ్చర్ల అంజనేయులనాయుడు తెలిపారు. గత సోమవారం వర్షం కోసం అయ్యప్ప విగ్రహానికి 101 బిందెలతో జలాభిషేకం చేశామన్నారు. అనంతరం భక్తులకు ఆర్ ఆర్ టైలర్ రాము ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నిజాం, చంద్రశేఖర్, సుభాషిణి, కుమార్, మహమ్మద్‌రఫీ, వీరాంజనేయులు, నరేష్, రమేష్, అంజి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఎక్స్‌ప్రెస్ రైలుబండి.. ఇక్కడ ఆగదండి..!

● ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. ముదిగుబ్బలో ఆగేది ఒక్కటే ● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు



ముదిగుబ్బ రైల్వే స్టేషన్

ముదిగుబ్బ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముదిగుబ్బలో రైల్వే స్టేషన్ ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్లు డివిజన్‌లో ధర్మవరం జంక్షన్ నుంచి ముదిగుబ్బ మీదుగా ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పెద్ద మండలంగా పేరొందిన ముదిగుబ్బలో అప్పట్లోనే రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ప్యాసింజర్ రైళ్లు గుంతకల్లు నుంచి తిరుపతికి వెళుతున్నాయి. వాటిలో ఒకటి ప్రతిరోజు నరసాపురం నుంచి ధర్మవరానికి నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఇక్కడ ఆగుతుంది. మిగతా ఆరు రైళ్లలో పద్మావతి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ నుంచి తిరుపతికి వెళ్లేటప్పుడు ముదిగుబ్బలో స్టాపింగ్ లేదు. తిరుపతి నుంచి కాచిగూడకు వెళ్లేటప్పుడు ఆగుతుంది. అంకోలా ఎక్స్‌ప్రెస్ వారంలో ఒకరోజు, పద్మావతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, నాగర్ కోయల్-ముంబాయ్ ఎక్స్‌ప్రెస్ వారంలో నాలుగు రోజులు, అమరావతి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, కాచిగూడ నుంచి మధురైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్ వారంలో ఒక రోజు ముదిగుబ్బ మీదుగా నడుస్తున్నాయి. మండలంలోనే కాకుండా కడప, పులివెందుల నుంచి పుట్టపర్తి నియోజకవర్గం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు ముదిగుబ్బ వచ్చి రైల్లో ప్రయాణిస్తుంటారు. కదిరి లేదా ధర్మవరానికి వెళ్లి రైలు ఎక్కే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ముదిగుబ్బ నుంచి తిరుపతి, మధురై, అరుణాచలం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వెళుతుంటారు. కడప, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి విద్యార్థులు విజయవాడ, మధురై, చెన్నై, హైదరాబాద్, తిరుపతికి చదువుకోవడానికి వెళ్తుంటారు. ఇప్పటికైనా ప్రస్తుత ఎంపీలు ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దూరప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బంది



దూరప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు కళాశాలలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరుణాచలం, మధురై లాంటి పుణ్య క్షేత్రాలకు వెళ్లాలంటే ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో దైవ దర్శనాలకు వెళ్లే వృద్ధులు కదిరి, ధర్మవరం వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ముదిగుబ్బ మీదుగా ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళుతున్నాయి. అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

- చింతలనాయుడు, ముదిగుబ్బ

రెండు రైళ్లు మారాలి



ముదిగుబ్బ నుంచి చెన్నై, మధురై లాంటి పట్టణాలకు వెళ్లాలంటే రెండు రైళ్లు మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముదిగుబ్బ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపే విధంగా చూడాలి. నరసాపూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వేళలు మార్చాలి. విజయవాడకు తెల్లవారుజామున రెండు గంటలకు చేరుకుంటుంది. ఆఫీస్‌లు తెరిచే వరకు స్టేషన్‌లోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- నాగరాజు, ముదిగుబ్బ

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 లక్షల ఆర్థిక సాయం



నవీన్ కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని రాజనోళ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నవీన్ రెండువారాల క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ. 5లక్షల ఆర్థికసాయం చేశారు. సోమవారం ఎమ్మెల్యే మృతుడి గ్రామానికి వెళ్లి.. అతడి భార్య, కుమారుడు, తల్లిదండ్రులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా తాను చూసుకుంటానని ఆ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులతో భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని మృతుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి విన్నవించారు. అలాంటివి ఏవీ జరగవని, తాను అండగా ఉంటానని తెలిపారు. నవీన్ ఆత్మహత్యకు చేసుకోవడానికి గల కారణాలను ఎమ్మెల్యే అడిగితెలుసుకున్నారు. ఓ మహిళ చెప్పుతో కొట్టడం వల్లే తీవ్ర అవమానంగా భావించాడని, అందుకే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు వివరించారు. ఆయనతోపాటు టీడీపీ మండల కన్వీనర్ ముబారక్, గరికపల్లి రామక్రిష్టారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న అన్నదాత సుఖీభవకు మద్దతుగా ట్రాక్టర్లతో ర్యాలీ

కదిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి మద్దతుగా ఈనెల 14న రైతులతో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడతూ.. అన్నదాత సుఖీభవ పథకం విజయవంతమైన సందర్భంగా ఈనెల 14న రైతులతో పీవీఆర్ గ్రాండ్ నుంచి ఉదయం 10 గంటలకు ట్రాక్టర్ ర్యాలీ బయలుదేరుతుందన్నారు. అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని, అక్కడ బహిరంగ సభ అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగి ముగుస్తుందనానరు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు కాలేదని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారని అన్నారు. ప్రజలు బుద్ధిచెబుతున్నా వైసీపీ నాయకులకు జ్ఞానోదయం కాలేదన్నారు. పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి హిందూపుర్ క్రాస్ మీదుగా బస్టాండ్‌కు బస్సులు అనుమతించే విషయాన్ని మరోసారి పునరాలోచించి, రెండురోజుల్లో నిర్ణయం చెబుతామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, ఫర్వీనాభాను, డైమండ్ ఇర్షాన్, చెన్నకేశవులు, కొండయ్య, చంద్రశేఖర్, ముబారక్, రాజశేఖర్‌బాబు, రెడ్డిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుల నియామకం

నల్లచెరువు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు సొసైటీ అధ్యక్షుడిగా ఎర్రగుట్టపల్లికి చెందిన కమ్మల వెంకటరమణ, డైరెక్టర్లుగా గంగులప్ప, ఆంజనేయులును నియమించారు. ఎస్.మొకలపల్లి సొసైటీ అధ్యక్షుడిగా బొమ్మిరెడ్డిపల్లికి చెందిన గంగయ్య, డైరెక్టర్లుగా సూదుల వెంకటశివన్న, తిరుపాల్‌నాయక్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లచెరువు సింగల్‌విండో అధ్యక్షుడు, డైరెక్టర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వారిని టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు, ప్రసాద్, నరసింహులు, నాగభూషణనాయుడు పాల్గొన్నారు.

●కొత్తచెరువు : మండల పరిధిలోని తలమర్ల, కేశాపురం సహకార సంఘాల అధ్యక్షులుగా గోపాల్‌రెడ్డి, బాబయ్యను ఎంపిక చేశారు. వీరు త్వరలోనే సహకార సంఘాలకు అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో స్వాధీనం

కదిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో హుస్సేన్‌పీరా అనే వ్యక్తి ఆటోను ఈనెల 10న దొంగలించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సోమవారం కుటాగుళ్ల రైల్వే గేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తిని గుర్తించి విచారించారు. దొంగలించిన ఆటోను గుర్తించారు. సైదాపురానికి చెందిన మురళీక్రిష్ణను అరెస్టుచేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి బిల్లులు ఇప్పించండి

తనకల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు బిల్లులు ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. రెండునెలలుగా బిల్లులు రాకపోతే కూలీలు ఏమి తిని జీవించాలని ప్రశ్నించారు. వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీ సుకోవాలని కోరారు. కార్యక్రమంలో మూడే ప్రసాద్, కూలీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిళ్లూరువాండ్లపల్లి సమీపంలో కుమ్మరిండ్ల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నడిమితండాకు చెందిన రవీంద్రనాయక్, వెంకటేష్ నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్రవాహనంలో అమడగూరు వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో నడిమితండాకు చెందిన రవీంద్రనాయక్‌కు కాలు విరగగా, వెంకటేష్‌నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని వందేమాతరం అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అందే అంబులెన్స్‌లో కదిరికి తరలించినట్లు చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధికి మందులు తీసుకుంటున్న వ్యాధిగ్రస్థులకు ధర్మవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, జిల్లా క్షయనివారణ మెడికల్ ఆఫీసర్ గాయత్రి పౌష్టికాహారం పంపిణీచేశారు. సోమవారం ఆసుపత్రిలో సూపరింటెండెంట్, క్షయనివారణ ఆఫీసర్ ఆధ్వర్యంలో సంగ్యూ హైటెక్ ఏపీప్రైవేటు లిమిటెడ్ వారు ఇచ్చిన కందిపప్పు, వేరుశనగ విత్తనాలు, శనగలు, గోదుమపిండి, రాగిపిండి, పామాయిల్, కోడిగుడ్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ పీపీఎం కోఆర్డినేటర్ నాగేంద్ర, అర్బన్ కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ కిష్టప్ప, బాలాజీ, చంద్రకళ, సావిత్రి పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

కదిరిఅర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మురళీక్రిష్ణకు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కదిరి పట్టణంలోని సైదాపురం గ్రామ పొలం సర్వేనెంబర్ 294, కుమ్మరవాండ్లపల్లిలో సర్వేనెంగర్ 720లో పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. వీరికి ఇంటి పట్టాలు మంజూరు చేసి, స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామమోహన్, బాబ్‌జాన్, నారాయణ, అంజి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నాట్యం



కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

ధర్మవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెలసిన రాఘవేంద్రస్వామి 354 ఆరాధన ఉత్సవాలలో భాగంగా శ్రీలలిత నాట్యకళానికేతన్ కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం పలువురిని ఆకట్టుకుంది. కళానికేతన్ గురువు రామలాలిత్య శిష్యబృందం 18 మంది కళాకారులు పాల్గొని రాఘవేంద్రస్వామి, నటరాజు కీర్తనలు, కూచిపూడి నృత్యాలు అలరించాయి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను సన్మానించారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి



బత్తలపల్లిలో జాతీయ పతాకాలతో విద్యార్థులు, నాయకుల మానవహారం

బత్తలపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మంత్రి కార్య లయ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలో సోమవారం హర్ ఘర్ తిరంగ ర్యాలీని విద్యార్థులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. ప్రధాని పిలుపు మేరకు దేశంలో ఉండే ప్రతి పౌరుడు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని, జాతీయ ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకులేటి వీరనారప్ప, భాస్కర్, సురేంద్ర, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కొత్తచెరువు : బీజేపీ నాయకులు విద్యార్థులతో హర్ ఘర్ తిరంగ ర్యాలీని చేపట్టారు. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా భారత్‌మాతాకి జై అంటూ ర్యాలీ నిర్వహిస్తూ నెహ్రూకూడలికి చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ కోకన్వీనర్ శేషాద్రినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు రమేశ్‌బాబు, మండల కన్వీనర్ గంగానాయుడు, సుదర్శన్‌నాయుడు, విశ్వనాథ్, భానుప్రకాశ్, లక్ష్మణరావు, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

● బుక్కపట్నం: ప్రతి ఒక్కరు దేశం పట్ల భక్తితో మెలగాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమేష్‌బాబు పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగ ర్యాలీని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు హరిక్రిష్ణగౌడ్, జ్యోతిప్రసాద్, రఫీ, విష్ణు, రాజేష్, విశ్వనాథ్, మహేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.




కొత్తచెరువులో మానవహారం, బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

అర్జీల హారంతో రైతు నిరసన



అర్జీల హారంతో నిరసన తెలుపుతున్న ఆంజనేయులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తన సమస్య పరిష్కారం కోసం అధికారులకు 285 సార్లు ఫిర్యాదు చేసినా పరిష్కరించకపోవడంతో ఓ రైతు అర్జీలను మెడలో వేసుకుని నిరసనకు దిగారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన కదిరికి చెందిన ఆంజనేయులు తనకు జరిగిన అన్యాయంపై అర్జీల హారం మెడలో వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. నల్లమాడ మండలం పులంగపల్లి గ్రామ సర్వేనెంబర్ 382/3, 383లో రెండు ఎకరాల 33 సెంట్లు భూమిని 2019లో కొనుగోలు చేశానని తెలిపారు. తాను కొనుగోలు చేసిన భూమి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. అప్పటి నుంచి తాను స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వందలసార్లు తిరిగి అర్జీలు సమర్పించినా పట్టించుకోలేదని ఆవేదన చెందారు. తాను ఏదైనా తప్పు చేసి ఉంటే జిల్లా నుంచి బహిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను ప్రాధేయపడ్డారు. సమస్యపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను జేసీ ఆదేశించారు.

నేడు పుట్టపర్తిలో రైతురథం ర్యాలీ

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ- పీఎంకిసాన్ పథకం కింద తొలివిడత రూ.7వేలు రైతులకు జమచేయడంతో ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి నేతృత్వంతో మంగళవారం రైతురథం పేరుతో భారీగా ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గంలోని టీడీపీ కన్వీనర్లు రామాంజనేయులు, మల్లిరెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, శంకర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వారు పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. రైతురథం ట్రాక్టర్ ర్యాలీని పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌సర్కిల్ నుంచి ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తారన్నారు. గణేష్‌సర్కిల్ నుంచి ఆర్టీసీడిపో, సత్యమ్మ ఆలయం, చిత్రావతిరోడ్డు మీదుగా కర్ణాటకనాగేపల్లి, జానకంపల్లి, బుక్కపట్నం, కొత్తచెరువు నెహ్రూసర్కిల్ మీదుగా కొత్తచెరువు మార్కెట్‌యార్డు వరకు జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం'



బడన్నపల్లిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోని ప్రజాసమస్యలను పరిష్కరించేందుకే 'మీ సమస్యామా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి అన్నారు. పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని బడన్నపల్లి, మల్కాపు రం, గొల్లపల్లి గ్రామాల్లో మీ సమస్యమా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజల నుంచి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. పలు సమస్యలను సచివాలయ సిబ్బంది ద్వారా అక్కడికక్కడే పరిష్కారించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, మండల ప్రధానకార్యదర్శి విజయసారధి, నాయకులు రాఘవరెడ్డి, తలారి వెంకటలక్ష్మి, బడన్నపల్లి క్రిష్ణ, రామాంజి, కాటమయ్య, మల్కాపురం అశోక్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీఓ

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉరుములు, పిడుగులతోకూడిన భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాలలో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సహాయం కోసం లేదా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కంట్రోల్‌రూం నెంబరు 9866057959కు సంప్రదించాలన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోండి

బత్తలపల్లి ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం గర్భిణీలకు ప్రధానమంత్రి సురక్ష అభియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్ర సూచించారు. సోమవారం స్థానిక బీడుపల్లిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులకు వృత్తివికాసం, జీవిత నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో పాటు జీవిత నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. డివిజన్ టోస్టు మాస్టర్ విక్రమ్, ఏరియా డైరెక్టర్ టోస్టు మాస్టర్ నవీన్, పలు సూచనలు చేశారు. హ్యుమానిటీ, సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

బత్తలపల్లి ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండవ్యాప్తంగా వివిధ కేసులలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ తప్పనిసరిగా ఇవ్వాలి

తాడిమర్రి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు తప్పని సరిగా ఇవ్వాలని ఎన్‌డీడీ రాష్ట్ర నోడల్ అధికారి గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం తాడిమర్రి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. అనంతరం అక్కడి సిబ్బందితో అల్బెండజోల్ పంపిణీ కార్యక్రమం గురించి చర్చించారు. మంగళవారం మండలంలోని 3,993 మంది పిల్లలకు అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో తప్పని సరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ చెన్నారెడ్డి, డాక్టర్ హరిత, సిబ్బంది రాంకుమార్, జానకీరాం, కోమల పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్థుల నిరసన

ముదిగుబ్బ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆ గ్రామానికి చెందిన ప్రజలు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. మూడురోజులుగా 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో తాగునీరు, పశువులకు నీరు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వర్షాకాలం కావడంతో రాత్రివేళ చీకటిమయంగా ఉండడంతో విషపురుగుల తో భయాందోళన చెందుతున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

న్యూస్ బాక్స్

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు


అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

మడకశిర టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకొని పట్టణంలో దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ సమీపంలో మెట్టబండ ఆంజనేయస్వామిని రంగు రంగు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. పావగడ రోడ్డులో వెలిసిన చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని బిల్వపత్రి అలంకరణ, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు, బిల్వార్చన, అభిషేకాలు చేపట్టారు. అభయ ఆంజనేయస్వామి, భోగి రామలింగేశ్వరస్వామి ఆలాయాల్లో ఉదయం నుంచి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

అగళి: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగళి శంకర, ఈశ్వరస్వామి, నరసంబుది లక్ష్మీరంగనాథస్వామి, కొమరేపల్లి బీరలింగేశ్వరస్వామి, మధూడి వీరభద్రేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో వస్తున్న మహిళలు

మడకశిర రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడగుంటలో వెలసిన కంబాల నరసింహస్వామి ఆలయంలో జ్యోతుల ఉత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి దేవాలయాల నుంచి ఊరేగింపు తీసుకువచ్చి నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేసముద్రం, వైబీ హళ్ళి గ్రామాల నుంచి మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి ఆలయం చూట్టూ ప్రదక్షిణలు చేసి మొ క్కులు తీర్చుకున్నారు.

15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



అమరాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు శివలింగ యాదవ్, మల్లికార్జున తెలిపారు. 15న గంగపూజ, గోపూజ, ధ్వజారోహణం, 16న విశేష పూజలు, అన్నదానం, 17న ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. తాడేపల్లి రాజామార్గంలో వెండి రథంలో ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవరాజు, చిత్రశేఖర్, చిట్టన్న, మనుమంతరాయ, దొడ్డయ్య, సురేష్, గోవిందరాయ, బీసీ చిత్తయ్య, శివన్న పాల్గొన్నారు.

ఘనంగా మధ్యనవమి


అలంకరణలో స్వామివారి బృందావనం

పెనుకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహిస్తున్న స్వామివారి ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు మధ్యనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, నిర్వహించారు. స్వామివారి బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బ్రాహ్మణ అన్నసంతర్పణ గావించారు. అర్చకులు వాదిచార్యులు, పాలూరి క్రిష్ణమూర్తి, వీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించేందుకు తీసుకొచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. అదికూడా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం విద్యార్థి సంఘాలను అణగదొక్కేవిధంగా ఉన్నాయన్నారు. అనుదీప్, నజీర్, అనీల్, ఆసిఫ్, అబి, ఆకాష్, ఫరూక్, బాషా పాల్గొన్నారు.

ఇంటర్ జోనల్ పోటీలకు ఎంపిక

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగే ఇంటర్ జోనల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు హిందూపురం నుంచి క్రీడాకారులు ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ తెలిపారు. కడప, సత్యసాయి జట్లు ఇటీవల జరిగిన పోటీల్లో తలపడగా సత్యసాయిజిల్లా జట్టు గెలుపొంది రాష్ట్రస్థాయికి అర్హత సాధించిందన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే పోటీలకు పురుషుల జట్టు వెళ్లనుందన్నారు.


ఎంపికైన క్రీడాకారులు

గోరంట్లలో వరుస చోరీలు..!

● బెంబేలెత్తుతున్న జనం ● నిద్రమత్తులో పోలీసులు


శనివారం చోరీ జరిగిన ఇల్లు

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గోరంట్లలో వరుస చోరీలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని బేతేలు చర్చి వీధి, పెన్షనర్స్ భవనం వెనుక వీధుల్లో వరస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బెతేలు చర్చి వీధిలోని కూరగాయల వ్యాపారి వెంకటరత్నమ్మ నివాసంలో 12తులాల బంగారు నగలు, అరకిలో వెండి వస్తువులు రూ.1.50 లక్షలు చోరీ జరిగినట్లు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోరంట్లకు చెందిన హరినాథ్ ఆరేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన భార్య వెంకటరత్నమ్మ కూరగాయల వ్యాపారం ద్వారా ఇద్దరు కుమార్తెలను పోషిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున కూరగాయాల కోసం బాగేపల్లికి వెళ్లి, అనంతరం గోరంట్లకు వచ్చి దుకాణంలో వ్యాపారం చూసుకుని రాత్రి ఇంటికి పోగా, చోరీ జరిగిన విషయం తెలిసి స్పృహతప్పి పడిపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఉదయం బంధువుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఇంటికి తాళం లేసి అంగడిలో కూరగాయాల వ్యాపారం చూసుకుని రాత్రి ఇంటికి వస్తానన్నారు. ఇది తెలిసిన వ్యక్తులే నకిలీ తాళాలతో లోనికి ప్రవేశించి, బీరువాలోని నెక్లెస్, ఆరు ఉంగరాలు, ఐదు జతల కమ్మలు, తాళిబోట్టు, గిన్నిబిట్టు, లక్ష్మీ డాలర్‌తోపాటు అరకిలో వెండి వస్తువులతోపాటు పిల్లల అవసరాలకోసం దాచుకున్న రూ.1.5 లక్షల నగదు ఎత్తుకెళ్లిన్నట్లు ఆవేదన చెందారు. శనివారం రాత్రి విశ్రాంత ఉపాధ్యాయుడు చలపతి నివాసంలో తాళం పగలకొట్టి 15తులాల బంగారం, రూ.7.5 లక్ష నగదు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఆ నివాసం పక్కనే మల్లాపల్లి ఏఎన్ఎం నూర్జహాన్ ఉంటున్నారు. శనివారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. సోమవారం తెలిసిన వ్యక్తులు ఇంటి వద్దకు రాగా, తలుపు తెరచిఉండడంతో అనుమానం వచ్చి ఆమెకు ఫోన్ చేసి విషయం తెలపగా, వెంటనే ఆమె గోరంట్లకు చేరుకుని పరిశీలించారు. తలుపులు పగలకొట్టి బీరువాలోని ఐదుతులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఇలావరస చోరీలతో గోరంట్ల ప్రజలు ఇంటికి తాళం వేయాలంటేనే భయపడుతున్నారు. పోలీసులు చోరీజరిగిన ఇళ్లను పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు. కూరగాయాల వ్యాపారి ఇంట్లో తలుపులుకానీ, బీరువాకానీ ఎలాంటి నష్టం కలగకపోవడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘాను పెంచి చోరీలను అరికట్టాలను పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ఇంట్లో వస్తువులను చెల్లాచెదురు చేసిన దుండగులు (ఫైల్)

బ్యాంక్ దోపిడీ కేసు చిక్కుముడి వీడేనా..?

● ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లిన డీఎస్పీ, సీఐలు

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన బ్యాంక్ దోపిడీ కేసు చిక్కుముడి వీడేలా కనిపిస్తోంది. గత నెల 26న రాత్రి తూమకుంట చెక్‌పోస్టులో ఉన్న ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10కోట్లు విలువచేసే ఖాతాదారులు కుదువపెట్టిన బంగారాన్ని, నగదును ఎత్తుకెళ్లిన సంఘటన తెలిసిందే. చోరీకి పాల్పడిన దుండగులు ఎలాంటి ఆధారంలేకుండా చాకచక్యంగా బ్యాంకును దోచుకెళ్లారు. దీనిపై రాష్ట్రస్థాయి పోలీసు అధికారులతోపాటు జిల్లా అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో డీఎస్పీ మహేష్, సీఐలు 15రోజులుగా నిందితుల కోసం గాలిస్తున్నారు. పోలీసులకు లభించిన ఆధారాలతో నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఎనిమిది బృందాలు గాలిస్తుండగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నేరస్తులే బ్యాంక్ దోపిడీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావించి ఆదిశగా దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు దొరికిన చిన్నపాటి క్లూతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఓ అనుమానితున్ని అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీ కేసుకు సంబంధించి కొంత ఆధారం దొరికినట్లు సమాచారం. దీంతో ఈ కేసును ఎలాగైనా వారంలోపు ఛేదిస్తామని డీఎస్పీ మహేష్ ఆంధ్రజ్యోతితో అన్నారు. ఇప్పటికే డీఎస్పీ, మరికొంతమంది సీఐలు దేశ రాజధానికి తరలి వెళ్లారు. దీంతో ఈ వారంలోపు కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం మెండుగా ఉన్నట్లు సమాచారం.

బీసీ కాలనీలో తీరిన తాగునీటి సమస్య

మడకశిర రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో మిట్టామీద ఉన్న బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సోమవారం టీడీపీ నాయకులు గ్రామానికి నీటిని అందించారు. టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి రాజేష్, కాలనీవాసులు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కాలనీకి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో వైసీపీ నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపానికిపోలేదన్నారు. వారంరోజులు క్రితం కాలనీవాసులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారం తిరగకుండానే గ్రామం మధ్యలో ఉన్న బోరు నుంచి మిట్ట ప్రాంతమైన కాలనీకి పైపులైన్ వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారన్నారు.

ఫైనల్లో కిమాల్-11ఎస్ జట్టు

మడకశిర టౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఎం.ఎస్.ఆర్ జీటీఎస్ టీ20 క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు కిమాల్-11ఎస్ జట్టు చేరింది. సోమవారం జరిగిన లెదర్ బాల్ క్రికెట్ టోర్నీలో మడకశిర స్పోర్ట్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 16.1 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిందూపురం కిమాల్-11ఎస్ జట్టు 14.3 ఓవర్లలో 5 వికెట్లకు 100 పరుగులు చేసి విజేతగా నిలిచింది. 15న జరిగే ఫైనల్స్‌లో ఆర్డీటీ హెచ్‌సీపీ, కిమాల్-11ఎస్ జట్లు తలపడనున్నాయి. ఎంఈఓ శ్రీనివాస్‌బాస్కర్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అభిమన్యు స్పోర్ట్స్ సభ్యులు నాగేంద్ర, వేణు, డీసీపీ రామచంద్ర, నిర్వాహకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

మడకశిర టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై సోమవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు డివిజన్ స్థాయిలో అవగాహన కల్పించారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ సాగుపై శిక్షణ పొందిన టీఓటీలతో శిక్షణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీ.సీ.ఎన్.ఎఫ్)పై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, నాగరాజు, టీఓటీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మలేరియా అధికారులు మండలంలో సోమవారం చర్యలు చేపట్టారు. పాలసముద్రం, బత్తలపల్లి, బీఎన్‌తండా గ్రామాల్లో మందు పిచికారి చేయించారు. 450 నివాస గృహాలకు మల్థాయేస్ 25శాతం పౌడర్‌ను పిచికారి చేశారు. హిందూపురం మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న, సూపర్‌వైజర్ గంగాధర్, ఆరోగ్య సిబ్బంది రంగనాథ్, శ్రీకాంత్, చెన్నారెడ్డి, చెన్నకేశవరెడ్డి, నేత్రావతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టు అక్రమం: కాంగ్రెస్

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గత పార్లమెంటు ఎన్నికల్లో అక్రమాలు జరిగాయాంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌కు తెలియచేసేందుకు వెళ్తుండగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ నాయకుడు నరసింహులు అన్నారు. ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై తగిన సాక్షాదారులు సమర్పించడానికి వెళ్తుంటే ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

మడకశిర టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని సుకన్య ఆస్పత్రి ఆవరణలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి చర్చించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు సుధాకర్, ఉమేష్, సుబ్బారాయుడు, దోడ్డరంగప్ప, రవీంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అగళి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలం రామనపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ సోమవారం ద్విచక్రవాహనంలో అగళి నుంచి రామనపల్లికి మరొకరితో కలిసి వస్తుండగా హైవే సర్కిల్‌వద్ద హైదరాబాద్ నుంచి తుమకూరు వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ శివానంద ప్రథమ చికిత్స అందించి తుమకూరుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐ బషీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరాతీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడికి..

గోరంట్ల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనవాండ్లపల్లి వద్ద టవర్ ఏర్పాటు చేస్తుండగా శీను అనే వ్యక్తి గాయపడ్డారు. చిత్తూరు జిల్లా శింగనాపురానికి చెందిన బలరాం కూమారుడు శీను టవర్ల నిర్మాణం కోసం ఈ ప్రాంతానికి వచ్చాడు. టవర్ నిర్మిస్తుండగా శీను ఎడమ చేయి యంత్రంలో ఇరుక్కుని చితికిపోయింది. వెంటనే అతన్ని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ తేజశ్విని చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపించారు.

జూదరుల అరెస్ట్

అగళి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలం జీజీ పల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సోమవారం ఎస్సై వీరేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.2230 స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లికి చెందిన కల్పన పాముకాటుకు గురై సోమవారం అస్వస్థతకు గురయ్యారు. చింతపల్లికి చెందిన ఆంజనేయుల భార్య కల్పన పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

మాజీ ఎంపీపీ కుమారుడి మృతి

రొళ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డగురికి తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ పాండురంగప్ప తనయుడు రఘు(40) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, వక్కళిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న, కార్యదర్శి ఉగ్రేగౌడ్, మారుతి ప్రసాద్, రేవన్న, మంజునాథ్, రామకృష్ణ, శీనప్ప, హేమంత్, కృష్ణమూర్తి, గోవిందప్ప, రామచంద్రప్ప ఉన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

అగళి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ వీరేష్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం వాహనాలను ఆయన తనిఖీచేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

ఉపాధిహామీ కూలీలకు బిల్లులు చెల్లించండి

గుడిబండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వాటికి బిల్లులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు. పదివారాలు పనిచేసినా ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి


అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

రొద్దం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎన్నోరకాలుగా ఆర్డీటిసంస్థ చేయూతనిచ్చిందని, ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన దళితులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంతో మంది పేదలకోసం ఇళ్లు, ఆరోగ్యం, చదువుకు అయ్యే ఖర్చు, ఆర్డీటీ భరించిందన్నారు. అలాంటి సంస్థ నేడు ఆర్థికలావాదేవీలు లేక మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకుని ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలన్నారు. తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు వారు వినతిపత్రం అందించారు. నరేష్, గోపాల్, అంజి, గోపాల్, దుర్గా, జయప్ప, మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని డీవీఎంసీ మాజీ సభ్యులు ఎంఎస్ మూర్తి ఆధ్వర్యంలో దళిత, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. దళిత సంఘం నాయకులు పెద్దన్న, నాగరాజు, నరసింహులు, అనీల్, లక్ష్మీనారాయణ, హెచ్‌ఆర్‌పీసీఐ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు గంగులయ్య, కిష్టప్ప, శంకరప్ప, శివన్న, హరికుమార్, మల్లికార్జున, మమ్మద్ హుస్సేన్, రియాజ్, అయాజ్ పాల్గొన్నారు.


పెనుకొండలో నిరసన తెలుపుతున్న దళిత సంఘం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పురం రోడ్ల అభివృద్ధికి రూ.45 కోట్లు

● మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ


మాట్లాడుతున్న రమేష్, వీరయ్య

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారులు, వంతెన నిర్మాణం కోసం రూ.45కోట్లు నిధులు విడుదలైనట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పలుచోట్ల ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతులు, నూతన రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం రూ.45కోట్లు పరిపాలన అనుమతులు ఇచ్చిందన్నారు. త్వరలోనే వీటికి సంబంధించి టెండర్లు పిలుస్తారన్నారు. హిందూపురం, పెనుకొండ రహదారిలో కొట్నూరు మరువవద్ద బ్రిడ్జి నిర్మాణం, కొడికొండవద్ద చిత్రావతిపై వంతెన నిర్మాణం, కిరికెర నుంచి బేవనహళ్లిపై వంతెన నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. కంచిసముద్రం, చిలమత్తూరు మండలం కర్ణాటక సరిహద్దులో తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. రాచపల్లి, చలివెందుల- కొండూరు మీదుగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి త్వరలోనే పనులకు టెండర్లు పిలుస్తారన్నారు. అప్పటికే పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.92.5కోట్లు, అహుడా నుంచి రూ.15కోట్లు, అమృత్‌పథకం ద్వారా రూ.108కోట్లు అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియలో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఎక్కడున్నా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు.

'ఇళ్ల పట్టాలు ఇవ్వండి..'


తహసీల్దార్ స్వాతికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని లబ్ధిదారులతో కలిసి సీఐటీయూ, సీపీఎం నాయకులు తహసీల్దార్ స్వాతికి వినతిపత్రం అందించారు. నాయకులు హరి, బాబావలి మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి ఇళ్లకు బాడుగలు కట్టుకుని పేదలు జీవిస్తున్నారని, ఇలాంటి వారికి ఇంటిపట్టాలు మంజూరుచేసి ఇళ్లు నిర్మించాలన్నారు. కియ వంటి పరిశ్రమలు రావడంతో విపరీతంగా బాడుగలు పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఇంటిపట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలని కోరారు. సీపీఎం నాయకులు నాగరాజు, నరసింహ, అబి, అనిత, శెక్షా, ఫక్రున్నీసా, వెంకటలక్ష్మి, సలీమ, లీలావతి పాల్గొన్నారు.

'పేదలకు న్యాయం చేయండి'


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో ప్రభుత్వ స్థలంలో నివాసమున్న పేదలకు న్యాయం చేయాలని తహసీల్దార్ మారుతికి సోమవారం కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెండేళ్లుగా నివాస స్థలాలకు అనుభవ హక్కు పత్రాలు ఇవ్వాలని అడుగుతున్నా పట్టించుకోలేదన్నారు. వీఆర్ఓ రమేష్ పేదల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నంబర్ 30, 28లను అమలు చేసి, పేదలకు న్యాయం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, స్వర్ణలత, వెంకటేష్, ఆంజనాదేవి, ఆంజనేయులు, భాస్కర్, అచ్చమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి గ్రామకమిటీలే ప్రధానం


నూతన గ్రామ కమిటీ సభ్యులు

చిలమత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతంలో గ్రామ కమిటీలే ప్రధానమని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక చౌడేశ్వరీ ఆలయంలో చిలమత్తూరు గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీల ద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాలన్నారు. అధ్యక్షులుగా వడ్డి భాస్కర్, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జయప్ప, కార్యనిర్వాహకులుగా నాగరాజు, ఆదినారాయణ, నరసింహప్ప, కార్యదర్శులుగా బాలరాజు, మురళీ, శ్రీనివాసులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అశ్వత్థప్ప, నందీషప్ప, విశ్వనాథరెడ్డి, చంద్ర, మంజు, కృష్ణమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీల ఎంపిక

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా కమిటీలను సోమవారం మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఫైవ్‌మెన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అంగనవాడీ బీసీసెల్, కల్చరల్‌సెల్, డాక్టర్స్ సెల్, ఐటీడీపీ, మైనార్టీ సెల్, ఎస్సీసెల్, తెలుగు మహిళా, తెలుగు రైతు, యువత, టీఎన్ఎస్ఎఫ్, టీఎన్‌టీయూసీ, విభిన్న ప్రతిభావంతుల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నవారిని గుర్తించి, అన్నిరంగాల్లో ముందుండేందుకు కృషిచేయాలని వారికి సూచించారు. మంజునాథ్, సర్పంచ్‌బాలాజీ, ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, వెంకటేశ్, సంజీవరాయప్ప, హనుమయ్య, జూలారెడ్డి, తిప్పారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయని ప్రభుత్వం: వైసీపీ

సోమందేపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయలేదని వైసీపీ కన్వీనర్ గజేంద్ర విమర్శించారు. సోమవారం పందిపర్తి గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల అమలు నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి తదితర పథకాలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.11.14 కోట్లతో తాగునీటి పనులు

గోరంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామాల్లో తాగునీటి సరఫరా పనులకోసం జలజీవన్ మిషన్ ద్వారా రూ.11.14కోట్ల నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ తెలిపారు. ఈనిధులతో గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు, బోర్లు, పైపులైన్‌లు, మోటార్లు, కొళాయిలు ఏర్పాటు చేస్తారన్నారు. మొదట ఐదు గ్రామాలపనులకు టెండర్లు పూర్తికాగా, సింగిరెడ్డిపల్లిలో రూ.72.52లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ పనిని ఇటీవల ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో గౌనివారిపల్లి రూ.66.84లక్షలు, బూదిలి రూ.71.80లక్షలు, వానవోలు రూ.70.37లక్షలు, రెడ్డిచెరువుపల్లిలో రూ.48.45లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. మిగిలిన పది పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి కావలసిన ఉందన్నారు. ఈమేరకు గోరంట్ల పట్టణంలో రూ.3.15కోట్లతో కాలనీల్లో మూడు ఓహెచ్ఎస్ఆర్‌లు, మండల కాంప్లెక్సువద్ద నుంచి ఎమ్మార్సీ భవనం వరకు 8 ఇంచుల పైపులైన్ ఏర్పాటు చేశారన్నారు. మలసముద్రంలో రూ.34.50లక్షలు, కమ్మవారిపల్లిలో రూ.43.50లక్షలు, ఖాజాపురంలో రూ.45.46లక్షలు, కరావులపల్లి రూ.65.28లక్షలు, పాలసముద్రం రూ.45.50లక్షలు, వడిగేపల్లిలో రూ.జ49.48లక్షలు, బూడిదగడ్డపల్లిలో రూ.64.87లక్షలు, గుమ్మయ్యగారిపల్లిలో రూ.49.90లక్షలు, కమ్మలవాండ్లపల్లిలో రూ.70.96 లక్షల వ్యయంతో తాగునీటి పనులు చేరపడతారన్నారు.